# ఏడు అద్భుతాలు

ప్రపంచంలో ఏడు అద్భుతాలకన్నా కూడా నాకు అద్భుతంగా కనపడేది ఏడు అనే అంకె అద్భుతం. మన సంస్కృతిలోనే కాక ప్రపంచంలోని ఇతర సంస్కృతులలో కూడా ఏడు అనే అంకెకు ఒక ప్రత్యేక స్థానం వుంది. అది ఎందుకో నాకు తెలీదు కానీ, దేని గురించి ఏం చదువుతున్నా ఈ ఏడంకె మాటి మాటికీ ఏడు రంకెలు వేస్తూ అడ్డొస్తూ వుంటుంది. నాకు ఏడంకెకు ఇచ్చిన ప్రాముఖ్యం చూస్తుంటే ఒక్కొక్కప్పుడు ఆశ్చర్యం కూడా వేస్తుంటుంది.

ఉదాహరణకి పెళ్ళప్పుడు అగ్నిహోత్రం చుట్టుతా వేసేవి ఏడడుగులు. సప్తపది. అలాగే సప్త సముద్రాలు. సప్త స్వరాలు. సప్త ఋషులు. సప్త ఋషి మండలం. మనది ఏడు జన్మల బంధం అంటాడు హీరో హీరోయిన్‌తో. విలన్‌తో నువ్వు ఏడు లోకాల్లో వున్నా పట్టుకుంటాను అంటాడు హీరో. అనగా అనగా ఒక రాజు గారి ఏడుగురు కొడుకులూ వేటకివెళ్ళి ఏడు చేపల్ని తెస్తారు. ఇలా కాస్త ఓపిగ్గా ఆలోచిస్తే ఇంకా ఎన్నో కనిపిస్తాయి. కొంచెం బయటికి దృష్టిసారిస్తే విదేశీ సంస్కృతిలో ఏడు చేసే గోడు చూద్దాం.

ప్రాచీన గ్రీక్ థేబ్స్ రాజ్యం చరిత్రలో ఏడుగురు హీరోలు. ప్రాచీన గ్రీసు చరిత్రలో ఏడుగురు రాజనీతిజ్ఞులు. అమెరికాలో జూన్ 26 1862నించీ జులై2 దాకా సివిల్ వార్ ఏడు రోజులు జరిగింది. క్రిస్టియన్ మత గ్రంథాలలో ఏడు రోజుల ఎడ్వెంచిస్టులు అనేవారు వున్నారు. ఆస్ట్రో ప్రష్షియన్ యుద్ధాన్ని ఏడు వారాల యుద్ధం అంటారు. 1756నించీ 1763దాకా యూరప్‌లో జరిగింది ఏడేళ్ళ యుద్ధం.స్నోవైట్ కథలో ఏడుగురు మరుగుజ్జులు. సెవెన్ వండర్స్ ఆఫ్ ది వరల్డ్. అంటే ప్రపంచంలోని ఏడు అద్భుతాలు. ఇక్కడ గమ్మత్తేమిటంటే ఈ ఏడద్భుతాలూ ఏనాడో ఏడే కానీ ఇప్పుడు ఏడు కాదు. అదెలాగో చూద్దాం.

440 బి.సి. లో వ్రాయబడిన "హిస్టరీ ఆఫ్ హీరోడేటస్" అనే పుస్తకంలో ఈ "ప్రపంచంలో అద్భుతాలు" అనే మాట ఊహా మాత్రంగా క్రీస్తు పూర్వం 500 సంవత్సరాల ముందునించీ వుందిట. "అలెగ్జాండ్రియా మూసియోన్" అనే లైబ్రరీలో కెల్లిమాకస్ (క్రీ పూ 305 240) అనే ఆయన వ్రాసిన పుస్తకంలో "ప్రపంచంలో అద్భుతాలు" గురించి వ్రాశాడు. తర్వాత ఆ లైబ్రరీ తగలబడిపోవటంతో అదీ అంతరించి పోయింది అని చరిత్ర చెబుతున్నది. క్రీస్తు పూర్వం 200సంవత్సరంలో వ్రాసిన ఆ ఏడు అద్భుతాలూ, ఈనాటికీ "ప్రాచీన ప్రపంచంలోని ఏడు అద్భుతాలు" పేరుతో చరిత్రలో లిఖించబడివున్నాయి. ముందు ఆ ఏడూ ఏమిటో చూసి, తర్వాత ఆ ఏడు ఏపేటా ఇన్నేళ్ళల్లో ఎన్నిఏళ్ళయిందో చూద్దాం. ఒకటోది, గ్రేట్ పిరమిడ్ ఆఫ్ గిజా. ఈ పేర్లని ఇంగ్లీషులోనే చెప్తేనే వాటికి న్యాయం చేసినట్టు వుంటుందని, తెలుగులోకి అనువాదం చేయటం లేదు. ఇది వున్నది ఈజిప్ట్‌లోని ప్రాచీన నగరం మెంఫిస్, అంటే ఈనాటి కైరో నగరానికి దగ్గర. ఇది ఒక పెద్ద రాతి కట్టడం.

అప్పుడు కట్టిన మూడు పిరమిడ్‌లలో ఆనాటి అద్భుతంగా ఒక్క టి మాత్రమే మిగిలింది. ఈజిప్షియన్ ఫారో "కుఫు" అనే అతని సమాధి. ఆనాడే ఎంతో గొప్ప ఇంజనీరింగ్ ఉపయోగించి కట్టిన గొప్ప కట్టడం ఇది. ఇది 145.75 మీటర్లు ఎత్తు. 2560 బి.సి.లో మొదలు పెడితే దీన్ని పూర్తిచేయటానికి 20 ఏళ్ళు పట్టిందట. అంత పెద్ద రాళ్ళని అంత ఎత్తుకి ఎలా తీసుకువెళ్ళారో పిరమిడ్ కోణాలని అంత సరిగ్గా ఎలా చేయగలిగారో, ఈనాటికీ అంతుబట్టని ఒక మిష్టరీ. దాదాపు 43 శతాబ్దాలు పైగా ఇది ప్రపంచంలోని గొప్ప అద్భుతంగా చెప్పబడింది. రెండవది,"హాంగింగ్ గార్డెన్స్ ఆఫ్ బాబిలోన్". ఇరాక్‌లో బాగ్దాద్‌కి దక్షిణంగా 50 కిలోమీటర్ల దూరంలో యుఫ్రెటస్ నదీ తీరానవున్నదిది. మెసపటోనియా రాజు నెబుబాడ్ నెజ్జర్ 2 అనే రాజు దీన్ని కట్టించాడు. పెళ్ళామో ప్రియురాలో తెలీదుకానీ ఆమెకి కొండలంటే కొండంత ప్రేమట. ఆవిడమీద ప్రేమకి చిహ్నంగా కట్టించాడాయన. నలుచదరంగా ఎంతో ఎత్తున్న కట్టడం. ఆ గోడలమీదా మేడలమీదా చెట్ల పేళ్ళు. రాతి స్థంబాల మీద నిలిచిన చెట్లు. పైనించీ భువికి పారుతున్న గంగ. మెరిసిపోయే పచ్చని గడ్డి. చూస్తుంటే నిజంగానే పైనించీ క్రిందకి వ్రేలాడుతున్న ఉద్యానవనంలాగా వుంటుంది.మూడవది ఒలెంపియాలోని "స్టాట్యూ ఆఫ్ జేయూస్". ఇది గ్రీస్‌లోని ఏథెన్స్ నగరానికి 150 కిలోమీటర్లు పడమర దిక్కుగావుంది. ఈ విగ్రహం కుడిచేతిలో దంతంతో, బంగారంతోనూ చేసిన విజయ చిహ్నం. ఎడమ చేతిలో రాబందు. బట్టలూ చెప్పులూ కూడా బంగారంతో చేసినవే. దీన్ని 450 బి.సి.లో లైబన్ అనే ఆర్కిటెక్ట్ కట్టాడు. 776 బి.సి.లో ఇక్కడే అంటే ఒలెంపియాలో ఒలెంపిక్ గేమ్స్ మొదలయాయి. కానీ క్రీపూ ఐదవ శతాబ్దంలో పెద్ద భూకంపంవచ్చి, విగ్రహం పూర్తిగా కూలిపోయింది.

నాలుగవది టర్కీలోని ఎఫీసుస్‌లోవున్న ఆర్టెమిస్ గుడి. దీనికి శంకుస్థాపన 700 బీసీలోనే జరిగినా, 550 బీసీలో పూర్తయింది. ఇది పూర్తిగా పాలరాతి కట్టడం. ఇక్కడ ఒక పెద్ద కంచు విగ్రహం. అన్ని ఆభరణాలూ బంగారంతోనూ,దంతంతోనూ చేసినవే. ఆ ఆభరణాలని పర్షియానించీ, ఇండియానించీ తెచ్చారుట. 356 బి.సి.లో ఒకానొక రాత్రి హీరో స్టేటస్ అనే విలనాసురుడు తనపేరు చరిత్రలోనిలిచిపోవాలని ఈ గుడిని తగలబెట్టాడు. గమ్మత్తేమిటంటే అదేరోజు అలెగ్జాండర్ పుట్టాడు. ఆ గుడిలోని దేవత అలెగ్జాండర్‌ని భూమి మీదకి తీసుకురావటంలో చాల బిజీగా వుండటం వల్ల, తన గుడిని తనే రక్షించుకోలేకపోయిందనే ఒక వదంతి కూడా వుంది. పెరిగి పెద్దయాక, దాన్ని అలెగ్జాండర్ బాగు చేయించాడుట కానీ, ఆ గుడికి మళ్ళీ పూర్వ వైభవం రాలేదు.

ఐదవది- టర్కీలోని హాలి కర్నాసస్ అనే చోట వున్న "మాసోలియమ్". 377 బిసీనించీ 353 బీసీదాకా ఏలిన రాజు మాసోలోస్ సమాధి అది. ఆయన చనిపోయాక మూడేళ్ళకి 350 బీసీలో ఇది కట్టారు. ఇది 45 మీటర్ల ఎత్తైన ఎంతో అద్భుతమైన కట్టడం. 1600 సంవత్సరాలలాగే నిలిచివుంది. తర్వాత వచ్చిన భూకంపంలో దీని కప్పు కూలిపోయింది. 1494లో మాల్టానైట్స్ ఆఫ్ సైంట్ జాన్ తన కోట కట్టుకోటానికని ఈ కట్టడంలోనించి ఒక్కొక్కరాయిని తీసుకోవటం ప్రారంభించి, 1522

నాటికి దీన్ని పూర్తిగా నామరూపాలు లేకుండా చేశాడు.

ఆరవది-గ్రీస్‌లోని కాలోసస్ అనే ప్రదేశంలోవున్న "కాలోసస్ ఆఫ్ రోడ్స్" అనే ఓ పెద్ద కంచు విగ్రహం. రోడ్స్‌లకీ ఆంటిగొనిడ్స్‌కీ జరిగిన యుద్ధంలో ఎవరూ గెలవక, ఎటూ తేలక, చివరికి ఒక శాంతి ఒప్పందం చేసుకున్నారు. ఆ శుభ సందర్భంలో 304 బీసీలో హీలియోఅనే సూర్యదేవుడికి చేసిన విగ్రహమది. 282 బీసీలో పూర్తయిన ఈ అద్భుతమైన విగ్రహాన్ని తయారుచేయటానికి పన్నెండేళ్ళు పట్టింది. ఈ విగ్రహం 226 బీసీలో వచ్చిన భూకంపంలో మోకాళ్ళ దగ్గర విరిగిపోయింది.

ప్రపంచంలో ఏడవ అద్భుతం,ఈజిప్ట్‌లోని అలెగ్జాండ్రియాలో లైట్ హౌస్. అలెగ్జాండర్ చనిపోయాక అతని కమాండర్ టోలియోసోటర్ రాజు అయాడు. ఆ ప్రదేశానికి అలెగ్జాండ్రియా అని పేరుపెట్టి రాజధానిగా చేసుకున్నాడు. 290బీసీలో మొదలు పెట్టిన ఈ లైట్‌హౌస్, అతను చనిపోయాక పూర్తయింది. సముద్రంలో వెళ్ళే నావలని కాపాడమని, రక్షించే దేవుళ్ళ కోసం కట్టారుట. పగలు సూర్యరశ్మిని అద్దాలతోనూ, రాత్రిపూట చెక్కల మంటలతోనూ, ఈ లైట్ హౌస్ దీపాలని సముద్రంలో నావలకి మార్గం చూపించేవారుట. తర్వాత వచ్చిన అరబ్స్ చేతివాటుతో, భూకంపాలలో ఇది 1323కి పూర్తిగా నేలమట్టం అయిపోయింది.

ఈ ఏడు ప్రాచీన అద్భుతాల గురించీ చదువుతుంటే ఏ దేశచరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం అనే శ్రీశ్రీ గేయం గుర్తుకొస్తుంది . సామాన్య ప్రజల దగ్గర వసూలు చేసిన డబ్బులో, రాజుల అంతర్యుద్ధాలలో చనిపోయిన తమ సమాధులనీ, భార్యా ప్రియురాళ్ళ కోసం గోరీలనీ అద్భుతంగా కట్టుకుని, ప్రజలకి ఏం న్యాయం చేశారో కానీ, చరిత్రకి మాత్రం నిధి నిక్షేపాలని అందించారు.

ఈ ఏడు ప్రాచీన అద్భుతాల తర్వాత చాలమంది రకరకాల ఏడు అద్భుతాలని సృష్టించారు. ఏడు సహజ అద్భుతాలనీ, మనిషి కట్టిన ఏడు అద్భుతాలనీ, ఏడు నవీన అద్భుతాలనీ ఇలా ఎన్నెన్నో. ఏడు సహజ అద్భుతాలు- ఎవరెస్ట్ పర్వతం, స్విజర్లాండ్‌లో మాట్టర్ హార్న్, అమెరికాలో మీటియర్ క్రేటర్, జాంబియాలో విక్టోరియా జలపాతం, ఆస్ట్రేలియాలో అయర్స్ పార్క్, అమెరికాలో గ్రాండ్ కాన్యన్ ఆస్ట్రేలియాలో గ్రేట్ బారియర్ రీఫ్. ఇలాగే మనిషి కట్టిన అద్భుతాల్లో చాల జాబితాల్లో కనపడేవి తాజ్‌మహల్, వాలిపోయే పీసా టవర్, న్యూయార్క్‌లో స్టాట్యూ ఆఫ్ లిబర్టీ, గ్రేట్ చైనా వాల్, ఈస్టర్ ఐలాండ్ లాటివి.

ఈ ఏడుఅనే బదులు ఈ ఇరవై ఆరూ, ఈ నలభై నాలుగు అనచ్చు కదా. అనరు. ఎందుకంటే ముందే అనుకునట్టుగా ఈ ఏడుకి నాకు అర్థం కాని అర్థం ఏదో వున్నట్టుంది. ఏదయితేనేం, పైన చెప్పిన వన్నీ నిజంగా అద్భుతమైనవే. వాటి గురించి తెలుసుకుంటుంటే మనిషి కట్టినవైనా ప్రకృతి సిద్ధమైనా, వాటి పరిమాణం, నైపుణ్యం, అందం చూసి ఒళ్ళు పులకరిస్తుంది. అందుకే వాటిని అద్భుతాలంటారేమో.

* * *